సాక్షి
నంద్యాల
సోమవారం । 7 । జూలై । 2025



మల్లన్నకు నృత్య నివేదన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై ఆదివారం హైదరాబాద్‌కు చెందిన డి.వి. ప్రసాదరావు బృందం వారు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



శిలాఫకాల ధ్వంసం

కూటమి ప్రభుత్వంలో విధ్వంస పాలన కొనసాగుతూనే ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనుల శిలాఫకాలను దుండగలు ధ్వంసం చేశారు. 8లో▸



టీడీపీ కార్యాలయానికి తాళం

ఆలూరు నియోజకర్గంలో టీడీపీలో ఏర్పడిన ముసలంతో చివరకు పార్టీ కార్యాలయానికి తాళం పడింది. ఏకంగా పార్టీ నియోజవకర్గ ఇన్‌చార్జ్‌ను మార్చేస్తున్నారు. 8లో▸



పీర్ల నిమజ్జనంలో పాల్గొన్న నవాబు వంశీయులు

అమరులను స్మరిస్తూ.. రక్తం చిందిస్తూ!

నల్లటి వస్త్రాలు ధరించి.. శోక గీతాలు ఆలపిస్తూ.. రక్తం చిందిస్తూ.. షియా మతస్తులు అమరులను స్మరించుకున్నారు. మహమ్మద్ ప్రవక్త మనువడి ప్రాణత్యాగానికి గుర్తుగా ఆదివారం బనగానపల్లె పట్టణంలో షియాలు మాతం ప్రదర్శన చేపట్టారు. తెలంగాణలో హైదరాబాద్ తర్వాత ఈ కార్యక్రమాన్ని బనగానపల్లెలోనే నిర్వహిస్తారు. నవాబు వంశీయులు నవాబు మీర్ ఫజలేఅలీఖాన్,ఆయన కుమారుడు గులాం అలీఖాన్ ఆధ్వర్యంలో షియా జరిగిన పీర్ల నిమజ్జనంలో భక్తిభావం ఉప్పొంగింది. ఆస్థానం రోడ్డు జనసంద్రమైంది.

– బనగానపల్లె/రూరల్



మాతంలో పాల్గొన్న షియా మతస్తులు

న్యూస్‌రీల్

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో సోమవారం ‘ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

శ్రీశైలంలో భక్తుల సందడి



దర్శనానికి బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచి పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మూడు విడతలుగా పలువురు భక్తులు టికెట్లు పొంది స్వామివారి స్పర్శదర్శనం నిర్వహించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.

మహానందిలో వైభవంగా తొలి ఏకాదశి



మహానందిలో ఉత్సవమూర్తులకు తిరుమంజనం పూజలు చేస్తున్న పండితులు

మహానంది: తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం మహానంది క్షేత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి గణపతిపూజ, ద్రవ్యపూజ, తిరుమంజనం, విశేష ద్రవ్యాలతో అభిషేక పూజలు జరిపించారు. మూలమూర్తులకు తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా కేవలం ఫలాలు మాత్రమే నివేదించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండితులు నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో నిలకడగా ఇన్‌ఫ్లో

హొళగుంద: తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో నిలకడగా ఉండటంతో ఆదివారం 19 గేట్లతోనే నీటి విడుదల చేస్తున్నారు. జలాశయానికి 72,490 క్యూసెక్కులు (ఇన్‌ఫ్లో) వచ్చి చేరుతుండగా ఒక్కో గేటును రెండున్నర అడుగుల మేర ఎత్తి 56,333 క్యూసెక్కులు నదికి, మరో 6 వేల క్యూసెక్కులను కాలువలకు.. మొత్తం 62,444 క్యూసెక్కుల(అవుట్ ఫ్లో) నీటిని బయటకు వదులుతున్నారు. డ్యాం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీల కాగా.. ప్రస్తుతం 77.343 టీఎంసీల నీరు ఉంది.



కోవెలకుంట్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం చేస్తున్న చిన్నారులు

అంగన్‌వాడీల్లో అప్పుల భోజనం

- నాలుగు నెలలుగా అందని బిల్లులు
- ఏడాదిగా పాత చార్జీలతోనే మెనూ అమలు
- పెరిగిన కూరగాయలు, నిత్యావసరాల ధరలు
- ధరల భారంతో చిన్నారులకు అరకొర భోజనం

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు	మధ్యాహ్న భోజనం చేసే చిన్నారులు
1,663	39,482

కోవెలకుంట్ల: పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నాలుగు నెలల నుంచి కూరగాయలు, నిత్యావసర సరుకులు, గ్యాస్ బిల్లులు చెల్లించకపోవడం అంగన్‌వాడీలపై ధరల భారం పడింది. జిల్లాలోని 29 మండలాల పరిధిలోఎనిమిది ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా 1,620 అంగన్‌వాడీ కేంద్రాలు, 43 మినీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో సున్నా నుంచి 6 నెలల లోపు 16,548 మంది చిన్నారులు, ఏడు నెలల నుంచి ఏడాదిలోపు 14,698 మంది, సంవత్సరం నుంచి మూడేళ్లలోపు 50,137 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు 39,462 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. 14,319 మంది గర్భిణులు, 13,077 మంది బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. మూడు సంవత్సరాలు పైబడిన చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. కూరగాయల ధరలు అమాంతం పెరగడంతో అప్పులు చేసి మెనూ అమలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వమే బియ్యం, కందిపప్పు, నూనె, పాలు, గుడ్లు సరఫరా చేస్తోంది. చిన్నారుల సంఖ్యకు అనుగుణంగా ఎంత మేరకు సరుకులు అవసరమో వారందించే జాబితా ప్రకారం పంపిణీ చేస్తారు. కందిపప్పు, రేషన్‌బియ్యం ప్రతి నెలా రేషన్ దుకాణాల ద్వారా తెచ్చుకోవాల్సి ఉంది. సరకులు తరలించేందుకు వీటిని కేంద్రాల్లో జాగ్రత్తగా నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి నగదు



అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

చెల్లించదు. అంగన్‌వాడీ కార్యకర్తలే అన్నీ భరించి తెచ్చుకోవాల్సి ఉంది.

అప్పుచేసి పప్పుకూడు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం అందించాల్సి ఉంది. ఒక్కో చిన్నారికి రోజుకు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, ఐదు గ్రాముల నూనె మాత్రమే ప్రభుత్వం కేటాయిస్తోంది. అలాగే వంట తయారీ, గ్యాస్‌కు సంబంధించి ఒక్కో చిన్నారిపై రోజుకు రూ. 2.25పైసల ప్రకారం నెలలో 25 రోజుల పనిదినాలకు చెల్లిస్తోంది. ఈ మొత్తంతో చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేయాల్సి ఉంది. కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చే బిల్లులు సరిపోక అంగన్‌వాడీ కార్యకర్తలు సొంతంగా కొంత మొత్తం చెల్లించి చిన్నారులకు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నారు. అరకొరగా ఇస్తున్న కూరగాయలు, గ్యాస్ బిల్లులు సైతం నాలుగు నెలల నుంచి విడుదల చేయకపోవడంతో అంగన్‌వాడీలు ఆందోళన చెందుతున్నారు. కూరగాయల షాపుల్లో నెలల తరబడి అప్పులు పేరుకపోయాయి. ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఐసీడీఎస్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. పెరిగిన ధరల ప్రకారం కూరగాయలు, గ్యాస్‌రూపంలో ప్రస్తుతం ఇచ్చే మొత్తాన్ని రెట్టింపు చేయాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో నాణ్యమైన భోజనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న మార్పులు చేసింది. కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్య నేర్పించడంతోపాటు మధ్యాహ్న భోజన వసతి, తల్లులకు పౌష్టికాహార కిట్లను అందిస్తూ తల్లి, బిడ్డ ఆరోగ్యానికి భరోసా కల్పించింది. ముఖ్యంగా చిన్నారులకందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే హాట్ కుక్ యాప్‌లో వివరాలు నమోదయ్యేలా చర్యలు చేపట్టింది. గ్రామ సచివాలయ మహిళా పోలీస్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించని అంగన్‌వాడీ కేంద్ర వివరాలను యాప్‌లో నమోదు చేసి నాణ్యమైన భోజనం అందించేందుకు కృషి చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక యాప్‌ల అమలుతో చిన్నారులు, తల్లులకు నాణ్యమైన సరుకులు అందటమే కాకుండా పౌష్టికాహార పంపిణీలో అక్రమాలకు తావు లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టింది.

ఇబ్బందులు పడుతున్నాం



అంగన్‌వాడీ కేంద్రాలకు నాలుగు నెలల నుంచి కూరగాయలు, నిత్యావసర సరుకులు, గ్యాస్ బిల్లులు అందటం లేదు. కొన్ని నెలల నుంచి మార్కెట్‌లో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వం ఏడాది నుంచి పాత బిల్లులను అందజేస్తుండటంతో మధ్యాహ్న భోజన పథక నిర్వహణ భారంగా మారింది. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని మెనూ చార్జీలను పెంచడంతోపాటు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి.

– వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు, కోవెలకుంట్ల

అంగన్‌వాడీ కేంద్రాలపై నిర్లక్ష్యం తగదు



పూర్వప్రాథమిక విద్యను అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. నాలుగు నెలల నుంచి కూరగాయలు, నిత్యావసరాల బిల్లులు అందలేదు. అంగన్‌వాడీ కార్యకర్తలు అప్పులు చేసి పిల్లలకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. బిల్లులు విడుదల చేయడంతోపాటు సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వ భవనాలు నిర్మించాలి.

– సుధాకర్, సీఐటీయూ జిల్లా నాయకుడు, కోవెలకుంట్ల

కూటమి నేతా.. మజాకా!

- ఆటో డ్రైవర్లపై ఆంక్షలు
- సరుకులతో ఆటోలు తిప్పొద్దని హుకుం
- ప్రయాణికులను మాత్రమే రవాణా చేయాలి

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి నాయకులు అధికార దర్పంతో సామాన్యులను సైతం బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఓ నేత తన వ్యాపారం కోసం ఏకంగా ఆటో డ్రైవర్లపై ఆంక్షలు విధించడం చర్చ నీయాంశంగా మారింది. సరుకులతో కాకుండా ప్రయాణికులను మాత్రమే ఆటోలు తిప్పుకోవాలని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో ఆటో వాలాలు ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. కొలిమిగుండ్ల మండలం పెట్నికోట సమీపంలోని కొండ ప్రాంతంలో కొత్తగా అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు జరుగుతున్నా యి. బీహార్, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడ పనులు చేసేందుకు వచ్చారు. కొలిమిగుండ్లలోని కస్తూర్బా పాఠశాల వద్ద ఉన్న ఇండస్ట్రీయల్ పార్కు సమీపంలో తాత్కాలిక వసతి ఏర్పాటు చేసుకుని రాక పోకలు సాగిస్తున్నారు. కాగా ప్రతి ఆదివారం వారు నిత్యావసర సరుకులు, కాయగూరలు, చికెన్, కోడిగుడ్లు, దుస్తులు కొనుగోలు చేసేందుకు మండల కేంద్రం కొలిమిగుండ్లకు వస్తుంటారు. కార్మికులు కొలిమిగుండ్లలో సరుకులు కొనుగోలు చేశాక ఆటోల్లో ఫ్యాక్టరీ పని ప్రదేశానికి వెళుతుంటారు. అయితే ఫ్యాక్టరీ ఆవరణలో కూటమికి చెందిన ఓ నాయకుడు కిరాణ దుకాణం ఏర్పా టు చేసుకున్నాడు. తన దుకాణంలోనే కార్మికులు సరుకులు కొనుగోలు చేసేందుకు ఆటో డ్రైవర్లపై బెదిరింపులకు పాల్పడ్డాడు. లగేజీతో కాకుండా మనుషులను మాత్రమే తీసుకురావాలని ఆటో డ్రైవర్లపై మూడు వారాలుగా ఒత్తిడి చేస్తు వస్తున్నా డు. ఈ విషయంపై మూడు రోజుల క్రితం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమానికి కొలిమిగుండ్లకు వచ్చిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఆటోవాలాలు కలిసి వినతి పత్రం అందించారు. ఈ ఆదివారం కూడా కార్మికులు లగేజీతో ఆటోల్లో వెళ్లడంతో వారితో వాగ్వావాదానికి దిగాడని డ్రైవర్లు పేర్కొన్నారు. ఆటోల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న తమపై కూడా ఆంక్షలు విధించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే ఆటో ఫైనాన్స్ కంతులు ఎలా కట్టుకోవాలని ప్రశ్నిస్తున్నారు.

నిర్లక్ష్యం అడ్డుకట్టగా మారి!

జూపాడుబంగ్లా: అధికారుల నిర్లక్ష్యం నీటి ప్రవాహానికి అడ్డుకట్టగా మారింది. సాగునీటి కోసం రైతులు ఎంతో ఆశగా ఎదురు చూస్తుండగా ‘గేట్లెత్తాం.. మా పనైపోయింది’ అన్నట్లుగా పోతిరెడ్డి హెడ్ రెగ్యులేటర్ పర్యవేక్షణ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఆదివారం హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేశారు. ఉదయం 11.30 గంటల ప్రాంతంలో శ్రీశైలం డ్యాంలో 878.40 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఐదో గేటు ఎత్తి 2వేల క్యూసెక్కుల నీటిని ఎస్సారెమ్సీ కాల్వలోకి విడుదల చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోతిరెడ్డిపాడు 2, 4, 5, 6, గేట్లను అడుగు మేర ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 9వేల క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వకు వెయ్యి క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. శ్రీశైలం డ్యాంలో నీటిమట్టం పెరిగేకొద్ది పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను పెంచే అవకాశాలున్నాయి. అయితే హెడ్‌రెగ్యులేటర్ దిగువన సమీపంలోనే నీటి ప్రవాహానికి మట్టికట్ట అడ్డుగా మారింది. పోతిరెడ్డిపాడు నుంచి బానకచర్ల వరకు ఎస్సారెమ్సీ లైనింగ్ పనులను పీఎన్‌సీ కంపెనీ దక్కించుకోగా.. వారు వ్యామ్ కంపెనీ వారికి సబ్‌కాంట్రాక్టు అప్పగించారు. హెడ్‌రెగ్యులేటర్ సమీపంలో మట్టికట్టను వేసి వేసవిలో లైనింగ్ పనులు చేపట్టారు. అయితే కాంట్రాక్టర్లు మట్టికట్టను తొలగించకపోవటంతో పోతిరెడ్డిపాడు నుంచి విడుదలయ్యే నీటిప్రవాహానికి మట్టికట్ట అడ్డంకిగా మారింది. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు తొలగించకపోవడంతో నీటి విడుదలకు హాజరైన ప్రజా ప్రతినిధులు, రైతులు అధికారుల తీరుపై మండిపడ్డారు.



నీటిప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టికట్ట

వీబీఆర్‌కు చేరిన కష్ణా జలాలు

వెలుగోడు: కృష్ణా జలాలు వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు చేరాయి. ఎగువ నుంచి వరద నీరు కష్ణానదిలోకి వచ్చి చేరడంతో పోతిరెడ్డిపాడు వద్ద ఆదివారం గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ మీదుగా 5 వేల క్యూసెక్కుల నీటిని వీబీఆర్‌కు మళ్లించారు. వెలుగోడు జలాశయం గరిష్ఠ నీటి మట్టం 16.95 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.8 టీఎంసీలు ఉన్నాయి.

పొగాకు రైతులను ఆదుకోవాలి

నంద్యాల(అర్బన్): జిల్లాలో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సహాయ కార్యదర్శి రామచంద్రుడు కోరారు. పొగాకు రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆదివారం వారు రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పొగాకు కొనుగోళ్లలో రైతులను మోసం చేసిన ప్రయివేట్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ నెలఖరులోగా రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోళ్లు చేస్తామని హామీ ఇచ్చిన వ్యవసాయాధికారులు మాట మార్చడం అన్యాయమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇతర జిల్లాల్లో పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మార్క్‌ఫెడ్‌ల ద్వారా కొనుగోలు జరిపిస్తున్నారన్నారు. నంద్యాల జిల్లాలో మాత్రం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయక పోవడం అన్యాయమన్నారు. మంత్రి చొరవ తీసుకొని ప్రభుత్వమే రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకును క్వింటా రూ. 15 వేలుతో కొనుగోలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు సుబ్బరాయుడు, సురేష్ ,నరసింహ పొగాకు రైతులు వెంకటేశ్వర గౌడ్, నారాయణ, శ్రీరాములు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

‘కూటమి’ మాట.. నీటి మూట!

- సాగునీటి కాలువలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- ఎన్నికల్లో హామీలను గాలికి వదిలేసిన టీడీపీ నేతలు
- హంద్రీ-నీవా నీటి వాటాపై గందరగోళం
- 68 చెరువులకు నీటి విడుదలకు నిధులేవీ?
- నేడు సాగు నీటి సలహా మండలి సమావేశం

కర్నూలు సిటీ: ‘ తాము అధికారంలోకి వస్తే సాగు నీటి ప్రాజెక్టులు చేపడతాం...పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం..స్థిరికరించిన ఆయకట్టుకు సమృద్ధిగా సాగు నీటిని అందిస్తాం’ అని ఎన్నికల సమయంలో కూటమి నేతలు మాట ఇచ్చారు. అధికారాన్ని చేపట్టి ఏడాది దాటినా సాగునీటి కాలువల మరమ్మతులు చేయలేకపోయారు. సాగునీటి ప్రాజెక్టులు అడుగు ముందుకు పడడం లేదు. జిల్లాలోని పశ్చిమ పల్లెల గొంతెండుతోంది. పంటలకు సాగు నీరు లేకపోవడంతో ఇప్పటికే వేలాది కుటుంబాలు పొట్టచేత పట్టుకొని వలస వెళ్లాయి. నేడు(సోమవారం) ఖరీఫ్‌లో ఆయకట్టుకు నీటి విడుదలపై చర్చించేందుకు సాగు నీటి సలహా మండలి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి జిల్లా మంత్రి టీజీ భరత్, ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు, ఆయా సాగునీటి ప్రాజెక్టు కమిటీల చైర్మెన్లు హాజరుకానున్నారు. రైతుల కష్టాలు, ప్రజల ఇబ్బందులపై ఈ సమావేశంలో చర్చిస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఇవీ సమస్యలు..

➡ టీబీ డ్యాం గేటు గతేడాది కొట్టుకపోవడంతో జలాశయం సామర్థ్యాన్ని 105.6 టీఎంసీల నుంచి 80 టీఎంసీలకు తగ్గించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా డ్యాం నుంచి నదిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. అదే నీరు తుంగభద్ర దిగువ కాలువకు విడుదల చేస్తే జిల్లాలోకి పశ్చిమ పల్లె ప్రాంతంలోని ఆయకట్టుకు ప్రయోజనం ఉంటుంది.



అధ్వానంగా ఆలూరు బ్రాంచ్ కాలువ

➡ ప్రస్తుతం తుంగభద్ర నదికి వరద నీరు వస్తోంది. నదీ తీరంలో ఉన్న ఎత్తిపోతల పథకాల లిఫ్టులు పనిచేయడం లేదు.

➡ జిల్లాలోని సాగు నీటి కాలువలు, ఎత్తిపోతల పథకాలు, మేజర్ చెరువుల తూములను ఏటా ఖరీఫ్‌కు ముందే మరమ్మతులు చేయాలి. కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది పైసా కూడా ఇవ్వలేదు.

➡ చెరువులు, గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలు, ఎల్‌ఎల్‌సీ నిర్వహణకు ఈ ఏడాది రూ.11.65 కోట్లు మంజూరు చేసినా ఇప్పటి వరకు పనులు సగం కూడా మొదలు కాలేదు. జీఎస్టీ కారణంతో టెండర్ పనులు చేసేందుకు ఎవరు ముందుకు రావడం లేదు.

➡ హంద్రీ- నీవా పరిధిలో జిల్లాలో 80 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. గతేడాది సగం ఆయకట్టు కూడా నీరు ఇవ్వలేదు. ఈ ఏడాదైనా హంద్రీ-నీవాలో జిల్లా వాటా నీరు ఎంతో కూడా స్పష్టత లేదు. మొత్తం 68 చెరవులకు నీరిచ్చేందుకు చేపట్టిన పథకం నిర్వహణకు నిధులు కేటాయింపే లేదు.

కరువు కనిపించదా?

తుంగభద్ర, హగేరి నదులపై గుండ్రేవుల, వేదావతి, ఆర్డీఎస్ కుడికాల్వ ప్రాజెక్టులు నిర్మించాల్సి ఉంది. గుండ్రేవులపై గతేడాది అసెంబ్లీలో చర్చించినా హామీ మాత్రం ప్రభుత్వ నుంచి రాలేదు.‘హగేరి నదిపై గత ప్రభుత్వం చేపట్టిన వేదావతి ప్రాజెక్టు పూర్తి కావాలంటే పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పూర్తి చేయాలి. గతేడాది కేటాయించిన తాత్కాలిక, ఈ ఏడాది కేటాయించిన వార్షిక బడ్జెట్‌లో పైసా నిధులు కేటాయించలేదు. ఆర్డీఎస్ కుడి కాలువ పనులకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయింపులు చేయలేదు.

సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

సాగునీటి వనరు	విస్తీర్ణం
కేసీ కెనాల్	3,763
ఎల్‌ఎల్‌సీ	1,51,134
ఆలూరు బ్రాంచ్ కెనాల్	14,255
హంద్రీనీవా	60,000
జీడీపీ	24,372

చిన్న నీటిపారుదల శాఖ పరిధిలో 27,707, లిఫ్టుల కింద 20 వేల ఎకరాల ఆయకట్టు ఉంది

క్లుప్తంగా

దుకాణంలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లె అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న దుకాణంలోకి ఆదివారం ట్రాక్టర్ దూసుకెళ్లింది. వివరాలిలా ఉన్నాయి..తాడిపత్రి నుంచి ఇటుకల లోడుతో ట్రాక్టర్ కొలిమిగుండ్ల వైపు బయలు దేరింది. మార్గమధ్యలో కనకాద్రిపల్లె వద్దకు చేరుకోగానే ట్రాక్టర్ పెద్ద టైర్ పగిలి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న దుకాణంలోకి దూసుకెళ్లింది. ప్రమాదాన్ని పసిగట్టిన దుకాణం యజమాని కిట్టు బయటకు పరుగు పెట్టడంతో ప్రమాదం తప్పింది. టైర్ పేలిన సమయంలో ఎదురుగా వాహనాలు రాక పోవడంతో ఓరకంగా ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

కృష్ణ జింక మృతి

ఆళ్లగడ్డ: బత్తలూరు వద్ద ఆదివారం ఓ కృష్ణ జింక మృతి చెందింది. విషయం తెలుసుకున్న రుద్రవరం రేంజి అధికారులు అక్కడికి చేరుకుని జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేంజ్ అధికారి మూర్తుజా ఆదేశాల మేరకు.. డాగ్ స్క్వాడ్ ఫారెస్టర్ ఖాన్, ఎఫ్‌బీఓ సురేంద్ర ఇరువురు కలిసి రుద్రవరం మండలం ఎర్రగుడిదిన్నె పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్‌తో పోస్టుమార్టం నిర్వహించారు. మృతి చెందిన జింకపై ఎలాంటి గాయాలు లేవని, గ్రామ సమీపంలోకి రావడంతో వీధికుక్కలు వెంబడించి ఉంటాయని, ఆ భయంతోనే జింక మృతి చెంది ఉంటుందని నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం జింక కళేబరాన్ని దహనం చేశారు.

యువకుడిపై హత్యాయత్నం కేసు

ఆదోని రూరల్: మండలంలోని జాలిమంచి గ్రామానికి చెందిన వీరేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పెద్దతుంబళం ఎస్‌ఐ మహేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. గ్రామంలోని ఒక మహిళను యువకుడు వీరేష్ లైంగికంగా వేధించేశాడని, మహిళ ప్రతిఘటించడంతో హత్య చేసేందుకు పూనుకున్నాడన్నారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో బొడ్డ మహేష్(14) అనే యువకుడు ఇంటికి క్యూరింగ్ చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. మృతుని తండ్రి బుడ్డ హనుమంతు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటికి నీటిని కూలింగ్ చేస్తుండగా విద్యుత్ మోటార్ ద్వారా షాక్‌కు గురై మృతిచెందాడన్నారు. తనకు ముగ్గురు కుమారులు ఉండగా, పెద్ద కుమారుడు మహేష్ విద్యుత్ ప్రమాదంలో మరణించాడని బోరున విలపించాడు.

కలప దుకాణంలో అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వెలుగోడు: పట్టణంలోని ఓ కలప దుకాణంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం రాత్రి 11 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో దుకాణంలో విలువైన టేకు కలప, ఫర్నిచర్, పరికరాలు, షెడ్డు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ. 16 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని దుకాణ యజమాని జయరాజ్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మాతం


బనగానపల్లె పురవీధుల్లో షియాల మాతం ప్రదర్శన


జెండాలతో పీర్లచావిడికి చేరుకుంటున్న ముస్లింలు


మాతంలో రక్తం చిందిస్తున్న షియాలు


చురకత్తులతో గాయం చేసుకుంటూ..

మొహర్రం సందర్భంగా బనగానపల్లె పట్టణంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో మాతం నిర్వహించారు. షియాలు శోకగీతాలు ఆలపిస్తూ బ్లేడ్లు, చురకత్తులతో యద, వీపుపై మాతం నిర్వహిస్తూ తమ రక్తాన్ని చిందిస్తూ అమరుల త్యాగాన్ని స్మరించుకున్నారు. మాతం ప్రదర్శనను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కొండపేటలోని ఇమాంఖాసీం పీరు జుర్రేరువాగు వద్దకు చేరుకున్న అన్ని పీర్లను ఆలింగనం చేసుకుంది. సుమారు 250 పీర్లను పట్టణంలోని జుర్రేరు వాగులో శుద్ధి చేసి అనంతరం వాటిని తిరిగిచావిళ్లకు తీసుకెళ్లారు. రాత్రి సంతాప సూచకంగా వ్యాపార దుకాణాలు, సినిమా హాళ్లు మూసివేయగా, వీధిలైట్లను ఆర్పివేశారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, బనగానపల్లె సీఐలు ప్రవీణ్‌కుమార్, మంజునాథ్‌రెడ్డి నంద్యాల ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఫొటోలు – డి.హుస్సేన్, సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


ఊరేగింపులో ఆకట్టుకుంటున్న ఎద్దుల బండి


మాతంలో పాల్గొన్న చిన్నారులు


సిద్ధంగా ఉంచిన 108 వాహనం

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని నందిపైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో రెండు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ బాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. విజేతలకు నందిగ్రూప్ ఆఫ్ అధినేత సుజల బహుమతులు అందజేశారు. ఉమ్మడి జిల్లా నుంచి 300 మందికి పైగా బాల,బాలికలు పాల్గొన్నట్లు ఏపీ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యాక్షులు వంశీధర్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆగస్టులో 5వ తేదీ నుంచి విశాఖపట్నంలో అండర్ –19 పోటీలు, ఆగస్టులో 21 నుంచి నెల్లూరులో అండర్ –15 పోటీలు, అక్టోబర్ 1 నుంచి నుంచి అనంతపురంలో అండర్ –17 పోటీలు, అక్టోబర్ 23 నుంచి ఒంగోలులో అండర్ –13 పోటీలు, నవంబర్ 1 నుంచి కడపలో అండర్ –11 పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో అసోయేషన్ సభ్యులు శేషిరెడ్డి, సంజీవరెడ్డి, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, కోచ్‌లు నాగార్జున, చైతన్య తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారునికి ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం

పీర్లను దర్శించుకునేందుకు వెళ్తూ..

డోన్ టౌన్: సొంతూరులో నెలకొల్పిన పీర్లను దర్శించుకునేందుకు వెళ్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. డోన్ పట్టణం ఇందిరానగర్‌లో నివాసముంటున్న ఇమామ్‌బాషా(34) సొంతూరు కొత్తబురుజు గ్రామం. డోన్ కంభాలపాడు సర్కిల్ వద్ద ఉన్న ఈద్గా మజీద్ ప్రాంతంలో బండిపై తినుబండారులు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సొంతూరులో మొహర్రం సందర్భంగా నెలకొల్పిన పీర్లకు మొక్కులు చెల్లించేందుకు ఆదివారం బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో యు.కొత్తపల్లె వద్ద ఉన్న భారత్‌దాబా ఎదురుగా జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి బెంగుళూరు వైపు వెళుతున్న లారీ బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇమామ్‌బాషా తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య షమీనా, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటనా స్థలానికి టౌన్ ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు.


ఇమామ్‌బాషా (ఫైల్)

తల్లిదండ్రులు మందలించారని విద్యార్థి బలవన్మరణం

ఆలూరు రూరల్: కురువళ్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి విజేంద్ర (15) పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ మహబూబ్ బాషా తెలిపిన వివరాల మేరకు.. కురువళ్లి గ్రామానికి చెందిన హనుమంతప్ప, అంపమ్మ దంపతుల కుమారుడు విజేంద్ర (15) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదవుతున్నాడు. సరిగా చదువుకోకుండా అల్లరిగా తిరుగుతున్నావని తల్లిదండ్రులు మందలించడంతో జూన్ నెల 29వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తల్లిదండ్రులు ఈ నెల 2వ తేదీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. కురువళ్లి గ్రామ సమీప పొలాల్లోని చెట్టుకు ఉరివేసుకుని వారం రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి చుట్టు పక్క పొలాల రైతులకు ఆదివారం కనిపించడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మహబూబ్ బాషా సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


విజేంద్ర (ఫైల్)

వైఎస్సార్‌సీపీలో జిల్లా వాసులకు పదవులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో జిల్లా వారికి పలువురికి పదవులు దక్కాయి. జిల్లా ఎస్సీ కమిటీ, జిల్లా ఎస్టీ కమిటీ, జిల్లా మున్సిపల్ విభాగ కమిటీల్లో పార్టీ నాయకులను నియమించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

జిల్లా ఎస్సీ విభాగ కమిటీలో...
జిల్లా ఉపాధ్యక్షులుగా ఎం. అవతారం (మంత్రాలయం), ప్రభుదాస్ (కర్నూలు), ప్రధాన కార్యదర్శులుగా పాండు (ఆలూరు), నెహెమ్యా (కోడుమూరు), తలారి వంశీ క్రిష్ణ (ఆదోని), డి. హరి ప్రసాద్ (పాణ్యం), మాదిగ స్వామి దాస్ (ఎమ్మిగనూరు), వెంకటేష్ (కర్నూలు), కార్యదర్శులుగా శాంతిరాజు (ఎమ్మిగనూరు), జి. సుధాకర్ (పత్తికొండ), ఎల్లప్ప (ఆలూరు), నాగప్ప (మంత్రాలయం), నంద కిషోర్ (కోడుమూరు), బండారి ఈరెన్న (ఆదోని), వి. శ్రీనివాసులు (పాణ్యం), శ్రీకాంత్ (కర్నూలు), లక్ష్మన్న (కర్నూలు), కార్యవర్గ సభ్యులుగా గుమ్మల చిన్న (ఎమ్మిగనూరు), జి. సుంకప్ప, జి. చంద్రశేఖర్ (పత్తికొండ), మృత్యుంజయ (ఆలూరు), ఎస్. అయ్యప్ప (మంత్రాలయం), సురేష్ (కోడుమూరు), టి. షబ్బీర్ బాషా (ఆదోని), ఆర్. రమేష్ (పాణ్యం), శివ (కర్నూలు) నియమితులయ్యారు.

జిల్లా ఎస్టీ విభాగ కమిటీలో...
ఉపాధ్యక్షులుగా ఆమ్రీష్ నాయక్ (మంత్రాలయం), మారెన్న (కర్నూలు,) ప్రధాన కార్యదర్శులుగా వై. రాజు (ఎమ్మిగనూరు), ఎరుకల నాగేష్ (ఆదోని), సి. వెంకట స్వామి (పాణ్యం), మునుస్వామి నాయక్ (ఆలూరు,) కార్యదర్శులుగా ఆర్. చిన్ని క్రిష్టా నాయక్ (పత్తికొండ), ముకా నాయక్ (ఆలూరు), హనుమంత్ నాయక్ (మంత్రాలయం),ఎరుకల గంగన్న (ఆదోని), వై. రమణ (కర్నూలు), మండ్ల నాగరాజు (పాణ్యం), కార్యవర్గ సభ్యులుగా బి. బాబు నాయక్, బి. రంగనాయక్ (పత్తికొండ), రామ నాయక్ (ఆలూరు), వై. పెద్ద ఉరుకుందు (మంత్రాలయం), వై. చిన్న రంగన్న (ఆదోని) ఎం. మద్దిలేటి నాయక్ (పాణ్యం)లను నియమించారు.

జిల్లా మున్సిపల్ విభాగ కమిటీలో..
ఉపాధ్యక్షులుగా లక్ష్మన్న (కోడుమూరు), కళ్యాణ్ (కర్నూలు), ప్రధాన కార్యదర్శులుగా వాల్మీకి రాజేష్ (ఆదోని), ఎస్.టీ. బాబు (కర్నూలు), హంపన్న (ఎమ్మిగనూరు), కార్యదర్శులుగా శివ గంగమ్మ (ఎమ్మిగనూరు), మద్దిలేటి (కోడుమూరు), బోయ లక్ష్మీ నారయణ (ఆదోని), పవన్ (కర్నూలు), కార్యవర్గ సభ్యులుగా పూజేశ్వరీ (ఎమ్మిగనూరు), మల్లెపోగు కిరణ్ కుమార్ (ఆదోని), ఎస్. మసూద్ (కర్నూలు)లు నియమితులయ్యారు.

బాబూ.. హామీని మరిచారు!

- ఏకలవ్యుని జయంతిని అధికారికంగా నిర్వహించాలి

కర్నూలు(అర్బన్): తాము అధికారంలోకి వస్తే ఏకలవ్యుని జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మరిచారని ఎరుకలి హక్కుల పోరాట సమితి నేతలు విమర్శించారు. విలువిద్యలో ఏకలవ్యుని జీవితం నేటి యువతరానికి ఆదర్శమని, ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఆదివారం ఏకలవ్యుని జయంతి సందర్భంగా స్థానిక వైహెచ్‌పీఎస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరుకల రాజు, గౌరవాధ్యక్షులు ఎరుకలి కుమార్, మాజీ కార్పొరేటర్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో తొలి ఏకాదశి రోజున ఎరుకల ఆరాధ్య దైవమైన ఏకలవ్యుని జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షులు ఎరుకలి హరి, ఏకలవ్య యూత్ జిల్లా అధ్యక్షులు ఎరుకల గోపి, ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు కుశలన్న, హరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన వైహెచ్‌పీఎస్ నేతలు

నేటి నుంచి పీజీ, బీటెక్ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీటెక్ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు వర్సిటీ కళాశాల కేంద్రంలో జరుగుతాయన్నారు. 452 మంది రెగ్యులర్, 44 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. బీటెక్ 4,6 సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, 3,5,7 సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 31వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. 360 మంది రెగ్యులర్, 325 మంది సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

8న పత్తికొండలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

తుగ్గలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు పత్తికొండ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఈనెల 8వ తేదీన ఉదయం 10 గంటలకు గోపాల్‌ప్లాజా మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నాగేష్ యాదవ్, మండల అధ్యక్షుడు అట్ల గోపాల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' క్యూ ఆర్ కోడ్ ద్వారా డాక్యుమెంటరీ విడుదల చేయనున్నట్లు చెప్పారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ మోహన్ రెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకరరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

బ్రహ్మగుండంలో సినిమా షూటింగ్


సినిమా షూటింగ్‌లో పాల్గొన్న సినీ నటులు

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని కామేశ్వరీదేవి సమేత బ్రహ్మగుండం క్షేత్రంలో ఆదివారం సినిమా షూటింగ్ జరిగింది. ఆర్‌ఎస్ క్రియేషన్స్ సమర్పణలో వెల్దుర్తికి చెందిన రోబో సుధాకర్ దర్శకత్వంలో, దివాన్ వలి రచయితగా లద్దగిరి శివ హీరోగా, ముంబై చెందిన తేజల్ హీరోయిన్‌గా నటిస్తున్న 'ఉంటే ఇలాగే ఉండాలి' సినిమా గత 15 రోజులుగా ఓర్వకల్లు మండలం చింతలపల్లిలో చిత్రీకరణ జరుగుతోంది. సినిమా సన్నివేశాల్లో భాగంగా హీరో, హీరోయిన్ల పెళ్లి సనివేశాన్ని దర్శకుడు ఆదివారం బ్రహ్మగుండం క్షేత్రంలో చిత్రీకరించారు. పెళ్లి సన్నివేశాల్లో మ్యాడ్ సినిమాలోని ఓ హీరోయిన్ సునీతా మనోహర్, సీరియల్ నటి స్వప్న జబ్బర్దస్త్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాల ధ్వంసం


ధ్వంసమైన బీటీ రోడ్డు శిలాఫలకం

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం మిట్నాల గ్రామ సమీపంలో ఏర్పాటైన జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘం భవనం ఏర్పాటు శిలా ఫలకం, మిట్నాల నుంచి గోస్పాడు మండలం జూలెపల్లె వరకు ఏర్పాటైన నిధులకు సంబంధించిన శిలాఫలకాలను ఆదివారం దుండగులు ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ. 17.50 లక్షలతో ఏర్పాటైన పాల వెల్లువ శిలాఫలకం, రూ.1.25 కోట్లు పంచాయితీ రాజ్ నిధులతో ఏర్పాటైన బీటీ రోడ్డు శిలాఫలకాలను మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి ప్రారంభించారు. శిలాఫలకాల ధ్వంసం వెనుక 'కూటమి' నేతల హస్తం ఉంటుందని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతిరెడ్డి, గోపాల్‌రెడ్డిలు ఆరోపిస్తున్నారు. పోలీసులు పూర్తిస్థాయి విచారణ జరిపి ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వారు కోరుతున్నారు.

టీడీపీ కార్యాలయానికి తాళం

- టీడీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తేలేవరకు ఇంతే!



ఆలూరు: అధికార పార్టీలో అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. ఆలూరులోని టీడీపీ కార్యాలయానికి తాళం వేసే వరకు వచ్చాయి. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తేలేవరకు ఇంతే సంగతులు అంటూ ఆ పార్టీ నాయకులే నిట్టూర్చుతున్నారు. టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న బి. వీరభద్రగౌడుపై ఆపార్టీ నాయకుల్లో వ్యతిరేకత ఉంది. ఆస్పరి మండలం కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమానికి కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు, ఆలూరు టీడీపీ పరిశీలకులు పూల నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ వీరభద్ర గౌడ్ అనుచరులు సమావేశాన్ని అడ్డుకున్నారు. 'నియోజకవర్గ ఇన్‌చార్జ్ లేకుండా ఇక్కడ మీ పెత్తనం ఏంటని' అంటూ నిలదీశారు. అనంతరం ఆలూరులో తొలి అడుగు కార్యక్రమానికి హాజరైన తిక్కారెడ్డిని గౌడ్ అనుచరుల అడ్డుకున్నారు. ఇన్‌చార్జి లేకుండా సమావేశం నిర్వహిస్తే ఒప్పుకునేది లేదని వేదిక ముందు బైఠాయించారు. తిక్కారెడ్డి డౌన్..డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలోనే అప్పటికప్పుడు అధిష్టానంతో మాట్లాడి ఆలూరు సమావేశంలోనే ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా వీరభద్రగౌడ్‌ను తొలగిస్తున్నట్లుగా ప్రకటించారు. దీంతో ఆదివారం ఆలూరు టీడీపీ ఆఫీసుకు తాళం వేసి నిరసన తెలిపారు.

శాస్త్రోక్తంగా తొలి ఏకాదశి పూజలు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మూలమూర్తులను సుప్రభాతసేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం నిత్యపూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరద స్వాములను ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి మంగళవాయిద్యాల మధ్య దూపదీపాలతో మహా మంగళహారతి అందించారు. రాత్రి విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు పల్లకీలో కొలువుదీరి తిరువీధిలో విహరించారు.


పూజలు చేస్తున్న పండితులు

విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి

కర్నూలు(అర్బన్): విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అవకాశాలు ఏర్పడతాయని పలువురు బ్రాహ్మణ నేతలు, అధికారులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక సంకల్‌బాగ్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులను ప్రోత్సహించేందుకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సండేల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వినియోగదారుల కోర్టు జడ్జి కే కిషోర్‌కుమార్, అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి డా.వేణుగోపాల్, కే రంగనాథశర్మ, కేవీ సుబ్బారావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రాహ్మణ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 4 వేలు నగదు, జ్ఞాపికతో పాటు శాలువా కప్పి సన్మానించా రు. సంఘం గౌరవాధ్యక్షులు చెరువు దుర్గాప్రసాద్, కార్యదర్శి చల్లా నాగరాజశర్మ, ఉపాధ్యక్షులు కంచుగంటల శ్యాంసుందర్, కోశాధికారి సీఎస్ ప్రసాదరావు, ఉప కార్యదర్శి నాగులవరం రాజశేఖర్, సలహాదారు రవిచంద్రశర్మ, నాయకులు మామిళ్లపల్లి రాజేష్, నాగేశ్వరరావు, శ్రీనివాసరాజు, ఫణి తదితరులు హాజరయ్యారు.


విద్యార్థులను సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం నేతలు